# క్షణం...క్షణం...భయం..భయం

డి.వి. రత్నమాణిక్యం

అర్ధరాత్రి 12 గం. – దూరాన వీధి కుక్కలు భయం గొలిపేలా మొరుగుతున్నాయి. "టిక్... టిక్ టిక్..." అలారం పీస్‌లోని సెకండ్‌ముల్లు నెమ్మదిగా కదులుతుంది. దాని శబ్దం సీలింగ్ ఫ్యాన్ చప్పుడులో కలిసిపోతుంది. జీరో క్యాండిల్ బల్బు తాలుకూ నీలం కాంతి – గది అంతా పరుచుకుంది. నీరజ గాఢ నిద్రలో ఉంది. నిద్రలో కూడా అలసటవల్ల వచ్చిన బలహీనత ఆమె అందమైన మోములో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఆ రోజే క్రొత్తగా అద్దెకు దిగారు. లంకంత ఇల్లు. పగలంతా ఇంట్లోసామాను సర్దుకోవడంతో సరిపోయింది. ఇంకా సర్దవలసిన సామాగ్రి తాలుకూ ప్యాక్‌లు అలానే పడి ఉన్నాయి. పగలంతా ఎంతో పనితో అలసిన ఆమె శరీరం "క్రొత్త ప్రదేశం" అయినా గాఢ నిద్రలోకి జారుకుంది, ఊరికి దూరంగా ఒంటరిగా విసిరివేయబడ్డట్లు ఉన్న బంగళా! హఠాత్తుగా గదిలో బల్బు ఆరిపోయింది. గది అంతా చీకటి ఆవరించింది. మరి రెండు నిమిషాలకు ఫ్యాన్ కూడా నెమ్మదిగా ఆగిపోయింది. ఫ్యాన్ ఆగడంతో గాలిఆడక నీరజకు మెలుకువ వచ్చింది. ఆమె కళ్ళు విప్పింది. చిక్కటి చీకటిలో ఆమె కళ్ళకు ఏమీ కనిపించలేదు. భీకరమైన కుక్కల మెరుగు ఉండీ – ఉండీ వినిపించసాగింది. అలారం పీస్‌లోని సెకండ్ ముల్లు చప్పుడు లయబద్ధంగా వినిపిస్తుంది. అప్పుడు గుర్తు వచ్చాడు భర్త! క్రొత్తగా చేరినరోజే అర్జంటు వ్యవహారం అంటూ ఒంటరిగా వదిలి వెళ్ళిన భర్తపై విపరీతమైన కోపం వచ్చింది. అలసట కలిగించిన గాఢ నిద్ర ఇంతవరకు ఒంటరితనాన్ని మరిపించింది. ఇప్పుడిప్పుడే "క్రొత్త ప్రదేశంలో ఉన్నానన్న" అనుభూతి ఆమెలో చోటు చేసుకోసాగింది. గాలి ఆడక ఒళ్లంతా చమట పట్టసాగింది. కరెంటు వస్తే ఎంత బాగుండు?మనసులో అనుకుంది. కోరిక తీరుస్తున్నట్లుగా బల్బు వెలిగింది. ఫ్యాన్ నెమ్మదిగా స్పీడ్ అందుకోసాగింది. "హమ్మయ్య... గుండెల మీద చెయ్యివేసుకుంది నీరజ. వెంటనే కరెంటు వచ్చినందుకు ఎంతో సంతోషం వేసింది ఆమెకు! కాని అది ఎంతోసేపు నిలువలేదు.

"గుర్ర్... గుర్ర్... గుర్ర్... ర్ర్... ర్ర్..." లోపల గదులనుండి మంద్రస్థాయిలో వినిపించసాగింది. ఆగి... ఆగి... వస్తుంది చప్పుడు... భయం తిరిగి ఆవహించసాగింది ఆమెను. తక్కువ అద్దెకు ఇంత విశాలమైన ఇల్లు... ఊరికి కాస్త దూరమైనా... ... దొరికినందుకు ఎంతో సంతోషించింది. ఇప్పుడు "తక్కువ అద్దె"లోని పరమార్థం అర్థంకాసాగింది నీరజకు. రానూ రానూ లోపల గదులలో అరుపులు ఎక్కువ కాసాగాయి. ఇంట్లో దయ్యం తిరగడం లేదుగా? ఆ ఆలోచనే ఆమెను భీతావహం చేసింది. ఫ్యాన్ తిరుగుతున్నా చమటతో ముద్దయిపోయింది. ఆమె గుండె చప్పుడు ఆమెకే స్పష్టంగా వినిపించసాగింది. బయట లాన్‌లో కీచురాళ్ల రణగొణ ధ్వని చెవులు తూట్లు పడేలా ఉంది. దడ్... దడ్... దడ్... డ్... డ్..మోటారుసైకిల్ ఇంటిముందు ఆగినచప్పుడు. దానితో నీరజకు ప్రాణం లేచివచ్చినట్లయింది. బిక్కు బిక్కు మనుకుంటూ తాళం తీసి గేటు తెరిచింది.

"హాయ్... య్..." అంటూ ఒక యువకుడు నీరజను నెట్టుకుంటూ లోపలికి వచ్చాడు. అంత భయంలోనూ ఆమెకు విపరీతమైన కోపం వచ్చింది.

"వాట్ నీరూ... వాట్ హ్యాపెండ్... నిద్రపట్టలేదా? సారీ! తప్పనిసరి అయి నిన్ను వదిలివెళ్ళవలసి వచ్చింది.... నొచ్చుకుంటూ అన్నాడు ఆమెభర్త. అంతే! లతలా అల్లుకుపోయింది" అతడిని. "ద్రు... ద్రు... డర్ర్..." ఈసారి వినిపించింది లోపలనుండి "ద... ద... దయ్యం..." కంపిస్తున్న కంఠంతో చెప్పింది భర్తకు. "నీ తలకాయ్... నన్ను చూడనీ..."...." ఆమె చేతిలోని తాళంగుత్తి అందుకున్నాడు. నీరజ వద్దని వారిస్తున్నా లోపల గది తాళం తీసాడు. నెమ్మదిగా తలుపు తెరిచాడు. అతడి వెనకాలే ఉన్న ఆమె భయంతో కళ్ళు మూసుకుంది. ఫక్కుమని నవ్విన అతడి నవ్వుకు కళ్ళు తెరిచింది. ఎదురుగా టేబుల్‌మీద రేడియో? ప్రోగ్రామ్స్ అయిపోయినా స్విచ్ కట్టివేయని రేడియో!

"ఇదిగో.... ఇదే దయ్యం...." నవ్వుతూ నీరజను కౌగిలిలోకి తీసుకున్నాడు అతడు. □

